# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- విశాఖలోని ఆర్కే బీచ్‌లో నేవీ డే సందర్భంగా నిర్వహించిన భారత నౌకాదళ వాయువిభాగం విన్యాసాలు ఆకట్టుకున్నాయి.
- రాష్ట్రంలో విమానాశ్రయాల ఏర్పాటుతో వేల మందికి ఉపాధి లభిస్తుందని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహనం నాయుడు పేర్కొన్నారు.
- ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలను అభివృద్ధి చేస్తామని మంత్రి నారా లోకేష్ అన్నారు.
- గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

================================

విశాఖలోని ఆర్కే బీచ్‌లో నేవీ డే సందర్భంగా ఈ రోజు నిర్వహించిన భారత నౌకాదళ వాయువిభాగం విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సాగర తీరంలో యుద్ధ విమానాలు, నౌకలు, హెలికాప్టర్లు, ట్యాంకర్లు సందడి చేశాయి. దాదాపు 8 వేల అడుగుల ఎత్తు నుంచి పారాచ్యూట్ సాయంతో జాతీయ జెండా, నేవీ జెండాను ఎగురవేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉగ్రవాదుల నుంచి బంధీలను రక్షించే సమయంలో యుద్ధ విన్యాసాలు, సముద్రంలో చిక్కుకున్న వారిని హెలికాప్టర్ల సాయంతో రక్షించే విధానం ప్రదర్శించిన తీరు అబ్బురపరిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరై విన్యాసాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్రన్ నేవల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ పాల్గొన్నారు.

================================

రాష్ట్రంలో విమానాశ్రయాల ఏర్పాటుతో వేల మందికి ఉపాధి లభిస్తుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా బారువ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈరోజు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ అశోక్ తో కలిసి కేంద్ర మంత్రి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో

కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా వారికి ఈ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. శ్రీకాకుళం జిల్లాలో కూడా విమానాశ్రయం ఏర్పాటు చేయనున్నామని, రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న విమానాశ్రయాలతో ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

===============================

ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలు, స్కూళ్లను తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పాయకాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని మంత్రి ఈ రోజు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినీలతో లోకేశ్ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. రానున్న రోజుల్లో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చే దిశగా కృషి చేస్తున్నామని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థినిలకు మంత్రి సూచించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ పాఠ్యప్రణాళికలో సమూల మార్పులు తెస్తున్నట్టు వెల్లడిస్తూ...

(వాయిస్ 37 సెకన్లు)

===============================

తెలుగులో ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా నిర్ణయం ప్రకటించడం పట్ల మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి. రమణ ఈ రోజు ఒక పత్రికా ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మాతృభాషలో విద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పించడం ద్వారా విద్యార్థులలో సృజనాత్మకత, భావ వ్యక్తీకరణ మరింత పెరుగుతాయని, అభివృద్ధి దిశగా సమాజాన్ని నడిపేందుకు ఇది ఒక గొప్ప మార్గదర్శకంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల భాషలో పరిపాలన జరగడం ప్రజాస్వామ్యంలో మరింత బలమైన చిహ్నమని తెలిపారు.

విరామం

===============================

సాంకేతికను ఉపయోగించి గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నామని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. అనకాపల్లి జిల్లా సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో హోం మంత్రి ఆకస్మికంగా ఈ రోజు తనిఖీ చేశారు. గంజాయి రవాణాపై కఠినంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా పోలీసులను ఆదేశించారు. అంతకు ముందు సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా అక్కడ విద్యార్థులతో మంత్రి మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణతో చదువుల్లో రాణించాలని ఆకాంక్షించారు. గంజాయి బారిన పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి రవాణా, గంజాయి సాగు లేకుండా ఈగల్ యాక్షన్ టీం రంగంలోకి దిగిందని పేర్కొన్నారు.

===============================

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, సినిమాటోగ్రాఫి శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం కడియపులంక గ్రామం జాతీయ రహదారి కాల్వ గట్టు నుంచి ఏటి గట్టు వరకు కోటి 85 లక్షల రూపాయలతో నిర్మించబోయే రహదారిని మంత్రి దుర్గేష్ శాసన సభ్యులు గోరంట్ల బుచ్చియ్య చౌదరితో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఈ రహదారి నిర్మాణానికి పర్యాటక శాఖ నిధులను కూడా కేటాయించడం చాలా సంతోషకరమన్నారు. రాష్ట్ర అభివృద్దే

ద్యేయంగా ప్రభుత్వం సమర్ధవంతంగా పనిచేస్తోందని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు సమకూర్చిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గుంతలు లేని రహదారులే లక్ష్యంగా పని చేస్తుందని తెలియజేస్తూ..

(వాయిస్ 20 సెకన్లు)

==============================

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వైకుంఠ ఏకాదశి దర్శన టోకెన్లను జారీ చేయనున్న కేంద్రాల్లో ఏర్పాట్లు వేగవంతంగా జరుగుతున్నాయని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఛైర్మన్ బి.ఆర్.నాయుడు పేర్కొన్నారు. సర్వ ధర్శన టోకెన్ల జారీ కౌంటర్లలో ఏర్పాట్లను తిరుపతిలో ఈ రోజు ఆయన పరిశీలించారు. ఈ టోకెన్లను జారీ సమయంలో తోపులాటలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని టిటిడి సిబ్బందిని ఛైర్మన్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. తిరుపతిలో 8 కేంద్రాల్లో, తిరుమలలో ఒక కేంద్రంలో మొత్తం 91 కౌంటర్ల ద్వారా దర్శన టోకెన్లను జారీ చేస్తున్నామని తెలిపారు. వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లకు సంబందించి ఎప్పటికప్పుడు కార్యనిర్వాహణ అధికారి, ఇతర అధికారులతో సమీక్షచేస్తున్నట్లు స్పష్టం చేశారు.

==============================

గ్రామస్థాయిలో భూవివాదాలను పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు గ్రామంలో ఈ రోజు జరిగిన రెవెన్యూ సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో గత నెల 6న ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు ఈనెల 8వ తేదీ వరకు కొనసాగుతాయని, రైతులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రజల వద్దకే అధికారులు వెళ్ళి సమస్యలను పరిస్కరించేలా చేస్తున్నామన్నారు.

==============================

వ్యవసాయ పనిముట్లను సబ్సిడీలో రైతులకు అందిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. గుంటూరులో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఈ రోజు మంత్రి పాల్గొని మాట్లాడుతూ... యాంత్రికరణను ప్రోత్సాహిస్తామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని, యాంత్రికరణను ప్రోత్సాహిస్తామని అన్నారు.

==============================
==============================